• తాగునీరు.. రోడ్డు పాలు



రామంతాపూర్: ప్రధాన రహదారి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రభుత్వ పాఠ్య పుస్తకాల గోడౌన్ వద్ద నాలుగు రోజుల నుంచి జలమండలి సరఫరా చేసే తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నీరంతా వృథాగా రోడ్లపై పారుతోంది. ప్రతినెలా నాలుగైదు సార్లు ఇలాగే లీకేజీలు ఏర్పడి తాగునీరు రోడ్లపై పారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తెచ్చి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

• కొత్తరోడ్డు.. పార్కింగ్‌కు అడ్డా..

రామంతాపూర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్‌లో ప్రధాన రహదారిని కలుపుతూ ఇటీవల లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్డుపై అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో పాదచారులు ఇతర వాహనదారులు ఈ రోడ్డు మీదుగా వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



• యూటర్న్.. డేంజర్..



రామంతాపూర్ ప్రధాన రహదారిలో ప్రగతి నగర్‌ను ఆనుకొని ఉన్న కట్టమైసమ్మ దేవాలయం పెద్ద చెరువు ఎదురుగా రోడ్డు డివైడర్లను తొలగించి కొత్తగా యూటర్న్ ఏర్పాటు చేశారు. రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండటంతో పాటు పెద్ద చెరువు సుందరీకరణలో భాగంగా ఇటీవల గ్రీనరీ కోసం నిర్మించిన డివైడర్లు యూటర్న్ తీసుకొని వెళ్లేటప్పుడు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మద్యం, డబ్బు పంపకాలపై ప్రత్యేక దృష్టి

• ఉప్పల్ రిటర్నింగ్ అధికారి అభిషేక్ అగస్త్యా



ఉప్పల్: ఎన్నికల్లో మద్యం, డబ్బుపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా ఈ సారి అలాంటి వాటికి చోటివ్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఉప్పల్ రిటర్నింగ్ అధికారి అభిషేక్ అగస్త్యా తెలిపారు. మద్యం, డబ్బు పంపిణీపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే రెండు దఫాలుగా ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక తరగతులు నిర్వహించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, ర్యాంప్‌ల ఏర్పాటు, వీల్ చైర్లు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో 17 మంది నోడల్ అధికారులు, 39 మంది సెక్టర్ అధికారులు, నిరంతరం అభ్యర్థులను వెంటాడే స్టాటికల్ సర్వేలైన్స్ టీం, వీడియో సర్వేలైన్స్ టీంలు నిరంతరం గస్తీ తిరుగుతాయన్నారు. ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ప్రత్యేక ఫోన్ నంబర్‌ను కేటాయించనున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజవర్గ పరిధిలో 409 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటరు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు.

వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసుకునే అవకాశం

80 ఏళ్ల పైబడి పోలింగ్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో ఉండే వారికి ఈ సారి ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఓటుహక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. వీరు ముందుగానే ఫారం 12డి పూర్తి చేసిన ఎన్నికల అధికారి పరిశీలన కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

మల్కాజిగిరిలో కాంగ్రెస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సోమవారం రాత్రి అల్వాల్‌లోని పంజాబీ కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 6 గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అల్వాల్ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షులు నిమ్మ అశోక్‌రెడ్డి, కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, నాయకులు కృష్ణగౌడ్, బాలపీర్, సంతోష్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రేపు ఉచిత వైద్య శిబిరం

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణ కాలనీలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. 55 సంవత్సరాలు పైబడిన వారందరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు పీఎస్ఎన్ చౌదరి, భానుచందర్‌రెడ్డి, మోబీన్, కటార్ల శేఖర్‌బాబు తెలిపారు.

13న చర్లపల్లి జైల్‌లో ఇనుప తుక్కు వేలం

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఈ నెల 13న ఇనుప తుక్కు వేలం పాట నిర్వహించనున్నట్లు జైల్ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు 32,706 కిలోల స్క్రాప్ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 13న ఉదయం 10:30 గంటలకు జైల్ ఆవరణలో జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.25 వేల ధరావత్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

మహిళల దుస్తుల కలెక్షన్ త్యోహార్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ మహిళా దుస్తుల ఎత్నిక్ వేర్ బ్రాండ్ సోచ్.. పండగ కలెక్షన్‌ను త్యోహార్ పేరిట సిటీ మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. బాందాని, కలంకారి, ల్యూరెక్స్.. వగైరా సంప్రదాయ, ఆధునిక వస్త్రాల కలయికలో షరారాస్, కఫ్తాన్స్, చుడీదార్ సెట్స్, గౌన్స్.. తదితర దుస్తులు నగరంలోని తమ అన్ని షోరూమ్స్‌లలో అందుబాటులో ఉన్నాయన్నారు.

13న మాస శివరాత్రి పూజలు

గౌతంనగర్: మాస శివరాత్రి సందర్భంగా ఉత్తంనగర్‌లోని శ్రీ దుర్గా జ్యోతిషాలయంలో ఉదయం 6 గంటలకు భవానీ శంకర(స్ఫటిక లింగం) స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, రుద్రహోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నాగరాజుశర్మ తెలిపారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన గోగికర్ శివకుమార్



కుషాయిగూడ: కాప్రాకు చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు గోగికర్ శివకుమార్ మంగళవారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు బొకేను అందజేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు శివకుమార్ పేర్కొన్నారు.

కేటీఆర్‌తో బీఆర్ఎస్ నేత అమీనుద్దీన్..



మౌలాలి: డివిజన్‌కు చెందిన మల్కాజిగిరి సర్కిల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అమీనుద్దీన్ మంగళవారం మల్కాజిగిరి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కేసీఆర్ ఓటమే లక్ష్యంగా పనిచేస్తా

• మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: రాష్ట్రంలో కేసీఆర్(బీఆర్ఎస్) ఓటమి కోసం పనిచేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. రాష్ట్రంలో ఎక్కడా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ స్థలాలు అమ్మి సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తున్నారని, అది కూడా ప్రజల డబ్బేనన్నారు. పార్టీలు రాజకీయ నాయకులకే ఉంటాయే తప్ప అధికారులకు ఉండవన్నారు. అధికార పార్టీకి అధికారులు భయపడతారేమో కానీ తాను భయపడనన్నారు. పార్టీ మారితే కార్యకర్తలను వేధిస్తానంటే ఊరుకోనని, కేసులకు కూడా భయపడమన్నారు.



మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

రాబోయే ఎన్నికల్లో అందరూ కష్టపడి తెలంగాణ ప్రకటించిన కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

అన్ని నియోజకవర్గాల్లో నా క్యాడర్..

మైనంపల్లి ఒక బ్రాండ్ అని ఒక్క నియోజకవర్గానికి పరిమితమైన వ్యక్తిని కాదని అన్ని నియోజకవర్గాల్లో క్యాడర్ ఉందన్నారు. మేడ్చల్, సిద్దిపేట, సిరిసిల్ల, నిజామాబాద్, కరీంనగర్, మెదక్‌తో పాటు చాలా నియోజకవర్గాల్లో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపేవరకు నిద్రపోనన్నారు.

మల్లారెడ్డి.. అంగూటా చాప్ మంత్రి

రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి అంగూటా చాప్ మంత్రి అన్నారు. ఆయనను ఎనుకున్న నియోజకవర్గ ప్రజలే ఆయనను తరిమి కొట్టిన ఘటన గుర్తుంచుకోవాలన్నారు. చెరువులను కబ్జా చేసి కళాశాలలు ఏర్పాటు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. నీతో పాటు అల్లుడి టికెట్టు కోసం కోట్ల రూపాయలు ఇచ్చి తెచ్చుకున్నారనేది ప్రజలకు తెలుసునన్నారు. ఎదుటి వాళ్ల మీద బురద చల్లే ముందు ఆయనేందో తెలుసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు పిట్టల శ్రీనివాస్, వెంకటేష్‌యాదవ్, జీఎన్వీ సతీష్‌కుమార్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, జీవన్‌రెడ్డి, గద్వాల జ్యోతి, ఉమేష్‌సింగ్, సంతోష్, జీడీ సంపత్‌గౌడ్, కన్న, పార్థసారథి, సానాది శంకర్, మంద భాస్కర్, చాకో పార్థసారథి, రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ డివిజన్ ఇన్‌చార్జిగా బొమ్మక్ శ్రీనివాస్

బోడుప్పల్: కాంగ్రెస్ 19వ డివిజన్ ఇన్‌చార్జిగా బొమ్మక్ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహరెడ్డి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తానని, తనవంతు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన నేతలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రిని కలిసిన యాదవ సంఘం ప్రతినిధులు



మంత్రి మల్లారెడ్డితో యాదవ సంఘం నేతలు

బోడుప్పల్: బోడుప్పల్ యాదవ సంఘం ప్రతినిధులు మంగళవారం బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి చామకూర మల్లారెడ్డిని కలిసి రానున్న అసెంబ్లీ ఎన్నికలకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. యాదవ సంఘం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని మంత్రి మల్లారెడ్డి హామీ ఇచ్చారు. కొండపోచమ్మ గుడి అభివృద్ధికి సహకరించాలని వారు కోరగా అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు వెల్లడించారు. మంత్రిని కలిసిన వారిలో యాదవ సంఘం అధ్యక్షుడు జనిగె బంగారు యాదవ్, ప్రధాన కార్యదర్శి పోతుల మల్లేష్‌యాదవ్, సభ్యులు గుర్రాల వెంకటేశ్‌యాదవ్, బింగి జంగయ్యయాదవ్, జనిగె శ్రీరాములు యాదవ్, జనిగె బాలయ్యయాదవ్, కొత్త శ్రీశైలంయాదవ్, యర్రగుంట్ల సత్యమూర్తి యాదవ్, బక్క రమేష్‌యాదవ్, లక్ష్మయ్యయాదవ్, రాసాల సత్యనారాయణ యాదవ తదితరులున్నారు.

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

అల్వాల్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని మంత్రి కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. అల్వాల్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత నేమూరి శ్రీధర్‌గౌడ్ మంగళవారం మల్కాజిగిరి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి ఇందిరాగౌడ్



ఇందిరాగౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మారెడ్డి

కాప్రా: కొంతకాలంగా యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉన్న బీజేపీ మాజీ నాయకురాలు ఇందిరాగౌడ్ గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో ఆమె పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి ఇందిరాగౌడ్‌ను ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. బండారి లక్ష్మారెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇకపై ప్రతినిత్యం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ముందుకెళ్తానని తెలిపారు.

కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

కుషాయిగూడ: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మంత్రి కేటీఆర్ సమక్షంలో తెలంగాణ డాక్టర్ ఫెడరేషన్ అధ్యక్షుడు, సన్‌సీడ్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ కలుకూరి అన్వేష్, డాక్టర్ భానుచందర్‌తో పాటుగా ఆలేరు నియోజకవర్గానికి చెందిన చామల ఉదయ్‌చందర్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ విజన్ వల్లే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. కేటీఆర్‌తో పాటుగా మంత్రి జగదీష్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత ఉన్నారు.



కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన తెలంగాణ డాక్టర్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ అన్వేష్

నేటినుంచి స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో

ఉప్పల్: ఉప్పల్ శిల్పారామంలో బుధవారం నుంచి 14 రోజుల పాటు స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్ ప్రారంభించనున్నారు. మంగళవారం ఉప్పల్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనరల్ మేనేజర్ అంజయ్య మాట్లాడుతూ చేనేత, హస్తకళలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా, చేతి వృత్తిదారులకు ప్రోత్సాహం కల్పించే విధంగా ప్రదర్శన ఉంటుందన్నారు. 120 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భారత దేశ సాంప్రదాయం ఉట్టిపడేలా దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శనలో ఉత్పత్తులు ఉంచనున్నట్లు తెలిపారు.



ఉప్పల్ శిల్పారామంలో ఎక్స్‌పోలో వస్తువులు

అసోసియేషన్ కార్యాలయానికి స్థలం కేటాయించాలి



బండారి లక్ష్మారెడ్డిని కలిసిన బైక్ మెకానిక్, ఆటోమొబైల్ వర్క్‌షాప్ అసోసియేషన్ ప్రతినిధులు

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలోని టూ వీలర్ మెకానిక్, ఆటోమొబైల్ వర్క్‌షాప్ అసోసియేషన్‌కు స్థలం కేటాయించాలని కోరుతున్నారు ఆ సంఘం ప్రతినిధులు. ఈ విషయంపై మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. దాదాపు 3 వేల మంది సభ్యులతో 8 అసోసియేషన్లుగా ఏర్పడ్డామని తెలిపారు. తమ సమస్యలు, ఇతర సలహాలు, సూచనల కోసం సమావేశాల ఏర్పాటుకు అసోసియేషన్ కార్యాలయాన్ని నిర్మించుకునేందుకు సహకరించాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులంతా బీఆర్ఎస్‌కే సహకరిస్తున్నామని.. ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, నరేందర్, మహిపాల్‌రెడ్డి, ప్రతాప్‌చారి, జైపాల్ రెడ్డి, నరసింహ, మహేష్, గణేష్ పాల్గొన్నారు.

బీఎస్పీ ఉప్పల్ టికెట్‌ను నరేష్‌కు కేటాయించాలి



బీఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌తో కాపు సంఘం ప్రతినిధులు

కుషాయిగూడ: ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గం నుంచి కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ న్యాయవాది, వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర నరేష్‌కు బీఎస్పీ నుంచి టికెట్ ఇవ్వాలని జంట నగరాల కాపు సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గంలోని కాపు సామాజికవర్గం సహకారం బీఎస్పీకి లభిస్తుందన్నారు. వినతిని స్వీకరించిన ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కాపు సంఘం నాయకులు డాక్టర్ బూరుగడ్డ శ్రీనాథ్, శంకర్‌బాబు, ఆకుల రమణమూర్తి, నరసింహ, బి.రాంచందర్‌రావు, నాగేశ్వర్‌రావు, గోపిశెట్టి స్వామి, జూపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

అల్వాల్: అల్వాల్‌కు చెందిన మాజీ గ్రేటర్ కో-ఆప్షన్ సభ్యురాలు గొట్టిముక్కల జ్యోతి శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా మంగళవారం మంత్రి కేటీఆర్‌ఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జ్యోతిగౌడ్‌కు మంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ప్రతి సమస్యను పరిష్కరిస్తా

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని ఆశ ఆఫీసర్స్ కాలనీలో మల్కాజిగిరి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ప్రతి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులు అమీనుద్దీన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

